మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

- అశోక్‌కుమార్

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేస్తున్న సలహాదారుడు అశోక్‌కుమార్, అధ్యక్షురాలు సుభాషిణి

బన్సీలాల్‌పేట్, జూలై 27 : దేశ పౌరులకు రాజ్యాంగబద్ధంగా లభించిన స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం ఉల్లంఘన జరగకుండా చూడాలని, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ముఖ్య సలహాదారుడు దూపకుంట్ల అశోక్‌కుమార్ అన్నారు. శనివారం న్యూబోయిగూడలోని మహాలక్ష్మి ఎల్‌పీజీ సెంటర్ భవనంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన అధ్యక్షురాలు, న్యాయవాది టి.సుభాషిణి, ముఖ్య సలహాదారుడు అశోక్ కుమార్‌లు గుర్తింపు కార్డులను అందజేసి, అభినందనలు తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎస్‌కేహెచ్.మొహినుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా మహేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, కోశాధికారిగా ఆర్.మమత, సభ్యులుగా శారద, సతీశ్, మమత, శ్రీదేవి లను ఎన్నుకున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియమ నిబంధనల ప్రకారం సమాజంలోని పేద, బడుగు వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండాలని, హక్కుల ఉల్లంఘనకు గురైన నిరుపేద బాధితులకు అండగా నిలవాలని, రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా, నిజాయితీగా పనిచేయాలని వారు సూచించారు.

నేడు ఆషాఢ బోనాల జాతర

- రెండు రోజుల పాటు వేడుకలు
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

ముస్తాబైన చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ అమ్మవారి ఆలయం

ముస్తాబైన కట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారు

సికింద్రాబాద్, జూలై 27: ఆదివారం జరిగే ఆషాఢ బోనాల జాతరకు సికింద్రాబాద్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. రెండు రోజుల పాటు వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. అందుకు ఆలయాల నిర్వాహకులు ,ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ, ఆలయ ప్రధాన అర్చకులతో పాటు ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ శాసన సభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్ చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయానికి తన సొంతంగా దాదాపు రూ ఏడు లక్షల నిధులను అందచేశారు.

చిలకలగూడలో....

చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయం ఆషాఢ బోనాల జాతరకు సిద్ధం అయ్యింది. ఆలయ పనులను ఇప్పటికే స్థానిక కార్పొరేటర్ హేమతో పాటు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల చార్యులు పర్యవేక్షించారు. ఆలయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సందర్శించి పనులను పర్యవేక్షించారు. అలాగే.. వారాసిగూడలోని భూలక్ష్మి అమ్మవారి ఆలయం, బ్రాహ్మణబస్తీలోని ఆరుట్ల మైసమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆల యం, ఇతర ఆలయాల్లో పాటు అమ్మవారి ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపులు కూడా వైభవంగా జరగనున్నాయి. పోతరాజుల ఆట పాటలు, విన్యాసాలు ఆకట్టుకోనున్నాయి.

పోలీసుల బందోబస్తు...

బోనాల జాతరలో భాగంగా అమ్మవారి ఆలయాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చిలకలగూడ ,వారాసిగూడ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాలతో పాటు ప్రధాన చౌరస్తాలు, ఇతర అనుమానిత ప్రాంతాల్లో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాలతో చిలకలగూడ, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, సైదులు పటిష్ట బందోబస్తును చేపట్టారు. అనుమానిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.

బేగంపేట్ డివిజన్‌లో..

బేగంపేట్ జూలై 27: బోనాల ఉత్సవాలకు బేగంపేట్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాధవరం కృష్ణారావులు ఇప్పటికే దేవాలయాల నిర్వాహకులకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం చెక్కులను అందించారు. ప్రధానంగా బేగంపేట్ ఓల్ట్ కస్టమ్స్ బస్తీ సమీపంలోని శ్రీదేవి కట్టమైసమ్మ, అలాగే ప్రకాశ్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని భూలక్ష్మి అమ్మవారి దేవాలయం లో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. ఉదయం ఆరు గంటల నుం చే భక్తులను అనుమతించనున్నట్టు కట్టమైసమ్మ దేవాలయం ఫౌండర్ చైర్మన్ చెక్కల సుభాశ్ ముదిరాజ్, అలాగే భూలక్ష్మి అమ్మవారి దేవాలయం ధర్మకర్త విశాల్‌సుదంలు తెలిపారు. బోనాలు సమర్పించే మహిళలకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీంతోపాటు బేగంపేట శ్యామ్‌లాల్, మయూరిమార్గ్, తాతాచారి కాలనీ, అల్లంతోటబావి, ప్రకాష్‌నగర్, పాటిగడ్డ తదితర ప్రాంతాల్లో ఉన్న వివిధ అమ్మవారి ఆలయాల్లో బోనాల వేడుకలు జరగనున్నాయి. బోనాల పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రామయ్యలు ఆయా ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోనాలకు ముస్తాబైన ప్రకాశ్‌నగర్‌లోని భూలక్ష్మి దేవి అమ్మవారి ఆలయం..

అడ్డగుట్ట డివిజన్‌లో..

అడ్డగుట్ట, జూలై 27 : బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాలకు వచ్చే భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు ఆలయాల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, నర్సింగ్, వడ్లూరి రవి, రామప్ప చారి, రాజు, బస్తీవాసులు భారతమ్మ, సత్తమ్మ, చారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డులు అందుకున్న వారితో నిర్వాహకులు

అమీర్‌పేట్, జూలై 27 : సామాజిక, పారిశ్రామిక, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన 40 మందికి గ్లోబల్ పినాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డ్స్ 2024లను అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు రిషిత, నచికేత్ రూపాల అధ్యక్షతన శనివారం బేగంపేట్ కంట్రీక్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకురాలు కొంపెల్ల మాధవీలత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సేవలు చేసిన వారికి అందించే అవార్డులు సమాజం పట్ల బాధ్యతలు మరింత పెంచుతాయన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు రిషిత, నచికేత్ రూపాలలు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి గత మూడేళ్లుగా సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఇండియన్ రోలర్ స్కేటర్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్ యామ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బాలయ్యనాయుడు లక్ష్మీకాంతం, ఫౌండేషన్ డైరెక్టర్ రమేశ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి : ఎమ్మెల్యే

మల్కాజిగిరి, జూలై 27: పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెరుగైన చికిత్స కోసం అల్వాల్ డివిజన్‌కు చెందిన జి. ప్రేమ్‌కు రూ.24వేలు, కే.సురేష్‌కి రూ.24 వేలు, నేరేడ్‌మెట్ డివిజన్‌కు చెందిన డి శ్రీనివాస్‌కురూ.60వేలు,ఎ.అజయ్‌కుమర్‌కు రూ.18వేలు, వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన బంద శ్రీనుకు రూ.54వేలు, మౌలాలి డివిజన్‌కు చెందిన కిరణ్‌కుమార్‌కు రూ.18 వేలు, ఈస్ ఆనంద్‌బాగ్ డివిజన్‌కు చెందిన దానమ్మకు రూ.31 వేలు, బాలమనికి రూ. 27వేల సీఎంఆ ర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీలు, మల్కాజిగిరిలో ఏరియా దవాఖానలు సేవలందిస్తున్నాయని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టైప్ రైటింగ్ పరీక్షలు



మారేడ్‌పల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో యస్.బి టెట్ ద్వారా నిర్వహిస్తున్న టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు ఉదయం పరీక్షా కేంద్రానికి చేరుకొని టైప్ రైటింగ్ పరీక్షలు రాశారు. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ ఏడాదికి రెండు పర్యాయాలు యస్.బి టెట్ ద్వారా టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్‌డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ తెలిపారు. – మారేడ్‌పల్లి, జూలై 27

వీరాంజనేయస్వామి ఆలయ కమిటీకి సన్మానం

ఆలయ కమిటీ సభ్యులతో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు

సికింద్రాబాద్, జూలై 27: నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులను శనివారం లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులు కలిశారు. ఆలయ కమిటీ చైర్మన్ దాడుగుల చందర్‌తో పాటు నలుగురు ట్రస్ట్ బోర్డు సభ్యులు కైలాస్ అరుణ్‌కుమార్, బేతాల నరేశ్, చింతల హేమలత, నవీన్‌కుమార్, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఆలయ ప్రధాన అర్చకులు పాలకుర్తి ప్రణవ్ కుమార్ లను ఆలయంలో కలిసి అభినందించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఆదం సంతోష్ కుమార్, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, అశోక్ చారి, చక్రధర్, అనిల్‌కుమా ర్, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

మేకలమండి పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేసిన జేసీఐ సభ్యులు

బన్సీలాల్‌పేట్, జూలై 27 : భోలక్‌పూర్ లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జేసీఐ, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, చిత్తశుద్ధితో చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు సుధన్వ, కార్యదర్శి వరూన్, కోశాధికారి కార్తిక్, పూర్వ అధ్యక్షుడు పి.గోపికృష్ణ, జేసీఐ జూనియర్ వింగ్ చైర్‌పర్సన్ వరుణి, కార్యదర్శి తరుణి, వెంకటేశ్, జగన్‌లు హాజరయ్యారు. పాఠశాల విద్యార్థుల తరపున పూర్వ హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, నీరజ, పరశురామ్, మహేశ్, సరిత దాతలకు ధన్యవాదములు తెలిపారు.

తెలంగాణపై మోడీ కక్ష పెంచుకున్నారు

కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చిత్రపటాలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 24: తెలంగాణ రాష్ట్రంపై ప్రధాని నరేంద్ర మోడీ కక్ష పెంచుకున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మండిపడ్డారు. తక్షణమే కేంద్రమంత్రి పదవులకు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపినందుకు నిరసనగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కిషన్‌రెడ్డి, బండి చిత్రపటాలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సైతం మోడీ పార్లమెంటు సాక్షిగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణలో ఐఐఎంను ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 2015లో ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటు చేసినప్పటికీ, తెలంగాణపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేని కేంద్రమంత్రులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారిని తెలంగాణలో తిరగనీయబోమని హెచ్చరించారు.

డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తుంది..

మల్కాజిగిరి, జూలై 27: డ్రగ్స్ వాడడకంతోజీవితాలు నాశనమవుతాయని నార్కోటిక్ డీఎస్పీ సుబ్బిరాం రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్‌లోని పల్లవి మోడల్ స్కూల్‌లో యువత మెలుకో అంటు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుబ్బిరాం రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి అందరు సహకరించాలని అన్నారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్

చాచానెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం పాన్‌బజార్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ శృతి, ఏఎన్ఎం వాణి ఆధ్వర్యంలో 15 ఏండ్లలోపు చిన్నారులకు జేఈ టీకాలను వేశారు. మెదడువాపు వ్యాధి రాకుండా ఈ వ్యాక్సిన్ పిల్లలను కాపాడుతుందని అన్నారు. స్థానిక బస్తీ నాయకుడు విజయ్ పాల్, తదితరులు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్

కంటోన్మెంట్ ఐదవ వార్డు కాకాగూడ కమ్యూనిటీహాల్‌లో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావుల సతీశ్ పర్యవేక్షణలో 9 నెలల చిన్నారుల నుంచి 15 సంవత్సరాల పిల్లల వరకు జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమకాటువల్ల సంక్రమించే మెదడువాపు వ్యాధి సోకకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భా గంగా జేఈ వ్యాక్సినేషన్ చిన్నారులకు వేస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వెల్లడించారు. – మారేడ్‌పల్లి, జూలై 27

అక్టోబర్‌లో రాజశ్యామల సహిత చండీయాగం

నీలిమకు విజ్ఞాపన పత్రం అందజేస్తున్న వాసుదేవ శర్మ

అమీర్‌పేట్, జూలై 27 : లోక కల్యాణార్థం అక్టోబర్‌లో రాజశ్యామల సహిత చండీయాగం నిర్వహించనున్నట్టు ధూప, దీప నైవేద్య అర్చక సంఘం గౌరవాధ్యక్షులు వాసుదేవ శర్మ తెలిపారు. ఈ మేరకు ఈ యాగానికి సీఎం రేవంత్‌రెడ్డి దంపతులను ఆహ్వానించే విషయంలో సహకరించాల్సిందిగా కోరుతూ సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం కోసం నిర్వహించే ఈ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా పూర్ణాహుతి ఇప్పించేందుకు సంఘం పెద్దలు నిర్ణయించినట్టు ఆయన వివరించారు. అదేవిధంగా ధూప, దీప నైవేద్య అర్చక సంఘం తరపున కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటి న్యాయమైన డిమాండ్లను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు సహకరించాలని వారు కోరారు. సంఘం ప్రతినిధుల విజ్ఞప్తిని సీఎం దృష్టికి తీసుకువస్తానని డాక్టర్ కోట నీలిమ హామీ ఇచ్చారు.

పర్యావరణంపై చిన్నారులకు అవగాహన

పర్యావరణంపై చిన్నారులు రూపొందించిన పోస్టర్లు

బన్సీలాల్‌పేట్, జూలై 27 : పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని, అందుకే చిన్నారులకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని భోలక్‌పూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాలలో పర్యావరణ రక్షణ దినం నిర్వహించారు. ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ రహిత సమాజం గురించి పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. తమ పుట్టిన రోజు తప్పనిసరిగా ఒక మొక్క నాటుతామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు విజయ్‌భాస్కర్, సంపూర్ణ, ఐలయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తాం

కాప్రా,జూలై 27:కాప్రాడివిజన్‌లో ఈస్ట్‌జోన్ జోనల్‌కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, కాప్రాసర్కిల్ డీసీ ముకుందరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని ఫుట్‌బాల్ మైదానంను, కందిగూడ కమ్యూనిటీహాల్‌ను, పార్కును, ఇతర సమస్యాత్మక ప్రాంతాలను జడ్సీ పరిశీలించారు. డివిజన్ పరిధిలో ఎన్నో ఏండ్లుగా అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరం మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ కోరారు. ఫుట్‌బాల్ మైదానంలో ప్రేక్షకులు కూర్చునేలా సీటింగ్ గ్యాలరీని అభివృద్ధిపర్చాలని,కందిగూడలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, పార్కును అభివృద్ధిచేయాలని, పలు ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు డివిజన్‌లో వార్డు కార్యాలయం భవనం నిర్మించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని వారు జడ్సీని కోరారు. జడ్సీ సానుకూలంగా స్పందిస్తూ ఆయా అభివృద్ధిపనులకు సంబంధించి నిధులను త్వరలోనే కేటాయిస్తానని,వార్డు కార్యాలయం భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూశాఖను కోరనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ హరిలాల్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్, వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కీసర, జూలై 27: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసిన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటయ్య కథనం ప్రకారం..ఈనెల 22న నాగారం మున్సిపాల్టీ శ్రీ వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన స్వరూప మెడలో నుంచి కొత్తోజు సందీప్‌చారి బంగారు గొలుసును తెంపు కొని ఆమెను తోసిసి పారేశాడు. శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా సందీప్‌చారి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చైన్ స్నాచింగ్‌తో పాటు మరో రెండు ఇండ్లలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. బంగారు గొలుసును తాకట్టు పెట్టిన్నట్లు తెలిపారు. గతంలో జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో చైన్‌స్నాచింగ్ కేసుల్లో జైలుశిక్ష అనుభవించాడని పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి పోలీసులు రిమాండ్ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

బొల్లారం, జూలై 27: డ్రగ్స్, మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజా నాట్యమండలి హైదరాబాద్ నగర్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తిరుమలగిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు రమణ మూర్తి, వైద్యులు రమాదేవిలు హాజరై మాట్లాడుతూ..సమాజంలో యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నగర నాయకురాలు సునీత, సహాయ కార్యదర్శి కళ్యాణ్, మారన్న, వసీయుద్దీన్, రఘు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎస్సై ప్రశాంత్, ప్రజా నాట్యమండలి బృందం

తిరుమలగిరి పల్లవి మోడల్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంకు శనివారం మార్షల్ ఆఫ్ ది ఎయిర్ అర్జున్ సింగ్‌గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫ్లైట్ లెఫ్టినెంట్ అమన్, ఎయిర్ కమాండర్ పంకజ్ జాయిన్, గ్రూపు కెప్టెన్ నరేంద్ర వర్మ, దీపక్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజ య లక్ష్మి సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

– బొల్లారం,జూలై 27